క్లుప్తంగా

50 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీలో బుధవారం వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా 60 ఏళ్ల దాటిన వారికి కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 50 మందికి పరీక్షలు చేశారు. కళ్లద్దాలు అవసరమైన వారిని గుర్తించారు. నగరంలోని ప్రభుత్వ కంటి ఆస్పత్రి సిబ్బంది కె.భవాని పరీక్షలు నిర్వహించారు. 523 సచివాలయ హెల్త్ సెక్రటరీ కె.షైలా బేగం, వలంటీర్లు టి.సరోజ, కె.పవన్ కుమార్, ఎస్.ధనలక్ష్మి, కె.లక్ష్మి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఐక్య పోరాటం



917వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పోరాడాలని పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 917వ రోజుకు చేరుకున్నాయి. సీపీఐ నాయకులు పాల్గొని కార్మికులు చేస్తున్న దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం తహతహలాడుతోందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ జోలికి వస్తే కార్మికులు, నిర్వాసితులు, రాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. దీక్షలు చేపట్టి 917 రోజులు గడుస్తున్నా.. కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కొనడానికి ఎవ్వరూ వచ్చినా అడ్డుకుంటామని, పోరాటలు, ప్రాణత్యాగాలతో ఏర్పాటైన కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం కానివ్వమన్నారు. ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు ఎంతోమంది నాయకులు, అమరవీరులు త్యాగం ముడిపడి ఉందని, నిర్వాసితులు తమ విలువైన భూములను త్యాగం చేశారని, అటువంటి పరిశ్రమను అమ్మితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐలో కొత్త కోర్సు ప్రారంభం

ఆరిలోవ: ఫుడ్ క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో గురువారం కొత్త కోర్సు ప్రారంభమైంది. డైరెక్టర్ జనరల్ రీ సెటిల్‌మెంట్ కోర్సుల్లో భాగంగా ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ కోర్సు ప్రారంభించారు. ఇందులో 41 మంది చేరారు. ఇది మూడు నెలల కాలవ్యవధి గల కోర్సు అని ఎఫ్‌సీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.వి రమణ తెలిపారు. దీంతో పాటు ప్రస్తుతం అసిస్టెంట్ కేటరింగ్ మేజర్ కోర్సులో 30 మందికి శిక్షణ జరుగుతుందన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

విశాఖ లీగల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం రీడింగ్ రూమ్‌లో న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి ఎం.వి. శేషమ్మ మాట్లాడుతూ బాలకార్మిక చట్టం, కనీస వేతనాల చట్టం మీద ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. ఈ సమావేశంలో కార్మికశాఖ అసిస్టెంటు కమిషనర్ ఎస్.మోహన్‌లక్ష్మి, అసిస్టెంటు లేబర్ ఆఫీసర్లు బి.అరుణ, సీహెచ్ శ్రీనివాసరావు, ఎన్.విజయలక్ష్మి, కె.మనోజ్‌కుమార్, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు అపార అవకాశాలు

అల్లిపురం : మహిళా పారిశ్రామిక వేత్తలకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, సమయ పాలన విషయంలో మహిళలు మెరుగైన పని తీరు కనబరుస్తున్నారని ఏపీ ఛాంబర్స్ ప్రెసిడెంట్ పైడా కృష్ణప్రసాద్ అన్నారు. చాంబర్స్ మహిళా పారిశ్రామిక వేత్తల విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మహిళా సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలు అల్లా లీలారాణి మాట్లాడుతూ 20 మంది సభ్యులతో ప్రారంభించిన మహిళా విభాగంలో నేడు 88 మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో జి.సాంబశివరావు, యార్లగడ్డ గీత పాల్గొన్నారు.

ఆశల సాగు!

- వరుణుడి కరుణ కోసం అన్నదాతల ఎదురు చూపు
- సిద్ధంగా వరినారు
- అందుబాటులో విత్తనాలు



ఆరిపాక రైతు భరోసా కేంద్రంలో సిద్ధంగా ఉన్న ఎరువులు



గొర్లివానిపాలెంలో వరి నారుమడిని పరిశీలిస్తున్న ఏవో సత్యనారాయణ

సబ్బవరం: మండలంలోని రైతులంతా ఖరీఫ్‌సాగుకు సన్నద్ధమయ్యారు. సీజన్ ఆరంభంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో వరినారు వేశారు. ఉభాలు వేసుకోవడానికి నారు అందివచ్చింది. ఈ సమయంలో వరుణుడు కినుక వహించడంతో అన్నదాతలు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. రానున్న వారం రోజుల్లో వర్షపాతం ఉంటుందని వాతావరణ శాఖ సూచనల మేరకు రైతులు సాగుపై ఆశలు పెట్టుకున్నారు.

సాధారణం కంటే తక్కువ వర్షపాతం

జూన్ నెల నుంచి ఇప్పటి వరకూ సాధారణ వర్షపాతం 374 మిల్లీ మీటర్లు కాగా 296 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. వరి నాట్లు వేసుకునేందుకు అవసరమైన దమ్ము చేసుకోవడానికి సరిపడా వర్షాలు కురవలేదు. చెరువుల్లో నీటి నిల్వలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. అయితే నారుమళ్లు ఆరోగ్యంగా ఉండడంతో వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

ఇదీ పరిస్థితి

మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 3,500 ఎకరాలు. వర్షాలు అనుకూలిస్తే ఆశించిన స్థాయిలో వరి నాట్లు పడే అవకాశం ఉంది. బోరు బావులు ఉన్న చోట ఇప్పటికే పలు గ్రామాల్లో 230 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. మిగిలిన విస్తీర్ణంలో వరినాట్లు వేసుకోవడానికి నారుమడులు సిద్ధంగా ఉన్నాయి.

నారు బెట్టుగా మారితే..

వర్షాభావ పరిస్థితుల వల్ల నారుమళ్లు బెట్టుగా మారితే సస్య రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. 2 శాతం యూరియా ద్రావణాం పిచికారీ చేయాలి. 19:19:19(మూడు 19)లను నారుమడిలో పిచికారీ చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఆశాజనకంగా గంటి దిగుబడులు

మండంలో రెండో ప్రధాన పంట అయిన గంటి సాగు ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. గత జూలై, ఆగస్టు మొదటి వారాల్లో కురిసిన వర్షాలు గంటి పంట మేలు చేశాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో దాదాపు 900 ఎకరాల్లో గంటి సాగు చేశారు. ప్రస్తుతం గంటి పంట కొందరు కోస్తున్నారు. మరి కొందరు నూర్పులు చేస్తున్నారు. దిగుబడులు బావున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన అవసరం లేదు



మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 3,500 ఎకరాలు. వర్షాలు అనుకూలిస్తే ఆశించిన స్థాయిలో వరినాట్లు పడే అవకాశం ఉంది. 2022 ఖరీఫ్ సీజన్‌లో 3,350 ఎకరాల్లో వరినాట్లు వేయగా ,2021 ఖరీఫ్ సీజన్‌లో 3,430 ఎకరాల్లో వరినాట్లు వేశారు. ఈ నెల ఆఖరు వరకూ నాట్లు వేసుకోవడానికి అవకాశం ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రైతులకు అవసరమైన అన్ని రకాల రసాయన ఎరువులను ప్రభుత్వం ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచింది. మండలంలో యూరియా 120 టన్నులు, డీఏపీ 30 టన్నులు, ఎంవోపి 20 టన్నులు చొప్పున ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.

–పోతల సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి,సబ్బవరం.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కార్పొరేటర్ ముమ్మన
- 16 కుటుంబాలకు నూతన రైస్ కార్డుల అందజేత



రేషన్ కార్డులు అందజేస్తున్న 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సచివాలయ ,వలంటీర్ల వ్యవస్థ చాలా గొప్పవని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. వివక్ష, అవినీతికి తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరవేయడంలో ఆ రెండు వ్యవస్థలు కీలక భూమిక పోషిస్తున్నాయన్నారు. 95వ వార్డులోని 499 సచివాలయం పరిధిలో వరలక్ష్మినగర్‌లో కొత్తగా 16 కుటుంబాలకు మంజూరైన రైస్ కార్డులను గురువారం ముమ్మన దేముడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా చేసి పాలన చేస్తున్నారన్నారు. కులమతాలు, పార్టీలు, వర్గాలు చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. పింఛన్ కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి తొలగించి ఇంటి వద్దే పింఛన్ అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఎవరెన్ని కుతంత్రాలు పన్నినా జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరని, ప్రజా బలం జగన్‌మోహన్‌రెడ్డికి మెండుగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి ఖావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంట్ల నర్సింహమూర్తి, అప్పికొండ రాంబాబు, పువ్వాడ త్రినాథ్, గోపాల్, భాగ్యలక్ష్మి, సచివాలయ వీఆర్‌వో సముద్రం, వెల్ఫేర్ సెక్రటరీ వెంకటరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న వెన్నలపాలెం ఉప సర్పంచ్ సన్యాసిరావు

పరవాడ: వెన్నలపాలెం శివారు పాయికారి కళ్లాలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఏర్పాటు చేస్తున్న మట్టి రోడ్డు పనులను ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు గురువారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.3 లక్షలు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. ఇది పూర్తయితే శివారు గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సన్యాసిరావు, వీఆర్పీ గంగునాయుడు, నాయకులు పైల సన్యాసిరావు, పైల అప్పారావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ

- శ్రావణ మాస పూజలు ప్రారంభం
- ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు



అడవివరంలోని దుకాణాల వద్ద ఫలాలు, పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

సింహాచలం: శ్రావణ మాస పూజలకు మహిళామణులు సిద్ధమయ్యారు. పూజలకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేశారు. దీంతో గురువారం మార్కెట్‌లకు శ్రావణ శోభ వచ్చింది. నెలరోజుల పాటు శ్రావణలక్ష్మిని భక్తి శ్రద్ధలతో పూజించేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. తమ ఇళ్లను పచ్చని తోరణాలతో అలంకరించి శ్రావణ లక్ష్మికి స్వాగతం పలికారు. తొలి శ్రావణ శుక్రవారం పూజలు చేసుకోవడానికి సిద్ధమయ్యారు. దీంతో అడవివరం మార్కెట్‌లో గురువారం సందడి నెలకొంది. మామిడి తోరణాలు, ఫలాలు, పుజాసామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడింది.

నేడు సింహగిరిపై లక్ష కుంకుమార్చన

శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని సింహగిరిపై లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని సింహవల్లీ తాయారు సన్నిధిలో ఉదయం 7 నుంచి 9గంటల వరకు లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. అలాగే సాయంత్రం 5.30 గంటలకు సహస్రనామార్చన నిర్వహించనున్నారు. లక్ష కుంకమార్చనలో పాల్గొనే భక్తులు రూ. 2500, సహస్రనామార్చనలో పాల్గొనే భక్తులు రూ.500 టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఈనెల 25వతేదీన, వచ్చే నెల 1,8,15 తేదీల్లో వచ్చే శ్రావణ శుక్రవారం రోజుల్లో కూడా ఉదయం లక్ష కుంకుమార్చన, సాయంత్రం సహస్ర నామార్చన నిర్వహించనున్నారు.

సింహాచలం: ఆలయాలకు శ్రావణ శోభ వచ్చింది. ప్రత్యేక పూజలు అందుకోవడానికి అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. జీవీఎంసీ 97వవార్డు సుజాతనగర్ దరి సప్తగిరినగర్ కాలనీలోని అలివేలు మంగాదేవి ఆలయంలో గురువారం నుంచి శ్రావణమాస మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. 18న తొలి శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ఉదయం 10 గంటల నుంచి లక్ష్మీసహస్ర నామార్చన, విష్ణు సహస్రనామార్చన నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. 25న రెండో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉదయం 10 గంటలకు లక్ష్మీసహస్రనామార్చన, విష్ణు సహస్ర నామార్చన, వచ్చేనెల 1వతేదీన శ్రావణ శుక్రవారం రోజు ఉదయం 10 గంటలకు సామూహిక కుంకుమార్చన, లక్ష్మీపూజ, సాయంత్రం 6గంటలకు అమ్మవారి సారె మహోత్సవం, 8వతేదీ, 15వ తేదీల్లో వచ్చే శుక్రవారం రోజుల్లో లక్ష్మీ సహస్ర నామార్చన, విష్ణు సహస్రనామార్చన ఉంటాయని తెలిపారు. అలాగే వచ్చేనెల 15వతేదీ వరకు ప్రతీ రోజూ ఉదయం 10 గంటలకు లక్ష్మీసహస్రనామార్చన ఉంటుందని తెలిపారు.గురువారాల్లో పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 27న శ్రావణ ద్వాదశిరోజు సాయంత్రం 7గంటలకు దీపారాధన, 30న శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. వచ్చేనెల 17న అన్న సమారాధన ఉంటుందని పేర్కొన్నారు.

- 97వ వార్డు సుజాతనగర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో గురువారం శ్రావణ మాస పూజలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం పార్వతీదేవి సహస్రనామార్చన, 25న శ్రావణ శుక్రవారం రోజు లక్ష్మీదేవి సహస్రనామార్చన, వచ్చేనెల 1న సరస్వతీదేవి సహస్రనామార్చన, 8, 15 తేదీల్లో కనకదుర్గమ్మ సహస్రనామార్చనలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.
- పెందుర్తి మండలం రాంపురంలోని రమా సహిత సత్యనారాయణస్వామి మరియు శ్రీ సంతోషి మాత ఆలయంలో గురువారం శ్రావణ మాస పూజలు ప్రారంభమయ్యాయి. శ్రావణ శుక్రవారం రోజుల్లో భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



హేమంత్‌కుమార్ (ఫైల్)

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. శ్రీకాకుళానికి చెందిన గున్న హేమంత్‌కుమార్(25) కప్పరాడలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. ఇతడు గతంలో హౌసింగ్ లోన్స్ కంపెనీలో పనిచేసేవాడు. ప్రస్తుతం ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉంటున్నాడు. బుధవారం ఉదయం బిర్లా జంక్షన్ వద్ద ఉంటున్న తన స్నేహితుల రూమ్‌కు అతడు వెళ్లాడు. అక్కడ ఎవరూ లేకపోవడంతో ఒక్కడే మద్యం తాగాడు. రాత్రి స్నేహితులు రూమ్‌కు వచ్చి చూడగా.. హేమంత్‌కుమార్ ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే ఆ స్నేహితులు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం అర్ధరాత్రి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సీఐ ఎన్ సాయి నేతృత్వంలో ఎస్‌ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు ఏంటన్న కోణంలో దర్యాప్తు సాగుతోంది.

31న భెల్ గుర్తింపు యూనియన్ ఎన్నికలు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) విశాఖపట్నం యూనిట్‌లో గుర్తింపు యూనియన్ ఎన్నికలు ఈ నెల 31న జరగనున్నట్లు రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో 450 మంది కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఓటింగ్ ప్రక్రియ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించనున్నారు. అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియను 25వ తేదీన నిర్వహించనున్నారు.

ఎన్నికల ప్రచారం

ఈ నెల 31న జరగనున్న భెల్(హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ ఫ్రంట్‌ల అలయన్స్‌ను గెలిపించాలని భెల్ హైదరాబాద్ యూనిట్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి కోరారు. ఎన్నికల సందర్భంగా గురువారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ రెండు యూనియన్లు నిరంతరం కార్మికుల శ్రేయస్సు, హక్కుల కోసం పోరాడుతున్నాయన్నారు. ఈ ఫ్రంట్‌లను గెలిపిస్తే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బి.ఆనందరావు, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడిగా పోటీలో నిలిచిన జి.టి.పి.ప్రకాష్, వి.ఎస్.మూర్తి, కె.విజయ్‌కుమార్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల రాణింపు

- ప్రముఖ వ్యక్తిత్వ వికాస మోటివేటర్ ఆచార్య అజిత్ కుమార్



వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆచార్య అజిత్ కుమార్

సబ్బవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే అన్ని రంగాల్లో రాణిస్తారు.. వారిని చిన్నచూపు చూసేవారిని దేశ ద్రోహులుగా భావించినా తప్పు లేదని ప్రముఖ వ్యక్తిత్వ వికాస మోటివేటర్ ఆచార్య అజిత్ కుమార్ అన్నారు. సబ్బవరంలోని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని పదోతరగతి,ఇంటర్ విద్యార్థులకు మానవ జీవన వికాసంపై గురువారం ఆయన అవగాహన తరగతులు నిర్వహించారు. దేశ ప్రధానులుగా ఇప్పటి వరకూ సుమారు 19 మంది ఉండగా వారిలో 17 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారేనని గుర్తు చేశారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో లక్షలు వెచ్చించి చదివించిన సంపన్న కుటుంబాలకు చెందిన పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలతో పోటీ పడలేరన్నారు. దేశ భవిష్యత్ నిర్ణయించేది తరగతి గదిలోనేనని పెద్దలు చెప్పినట్టు విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి సాకారానికి కార్యాచరణతో కృషి చేయాలని సూచించారు. రానున్న 5, 6 సంవత్సరాల్లో ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక శక్తిగా భారతదేశం ఎదగనుందని తెలిపారు. యువత ప్రధానంగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో వారి నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు యోగాసనాలు, ధ్యానం వంటివి సాధన చేయాలని సూచించారు. గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ రూపావతి మాట్లాడుతూ అంతర్జాతీయ మోటివేటర్‌గా పేరుతెచ్చుకున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన అజిత్ కుమార్ తమ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ కుమార్‌తో పాటు మిగిలిన అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా రాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవం



రాజరాజేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రాంకీ ప్రతినిధులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో రాంకీ కార్యాలయానికి సమీపంలో కొలువుదీరిన శ్రీ గణపతి, సుబ్రహ్మణ్య, శ్రీచక్ర సహిత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు గురువారం వైభవంగా ఆరంభమయ్యాయి. ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. రాంకీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి.లాల్‌కృష్ణ దంపతులు, రాంకీ సీఎఫ్‌వో ఎన్.ఎస్.రావు దంపతులు ఆలయ ప్రదక్షిణ, గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, మూల మంత్రహోమం, ధ్వజారోహణ, నీరాజన మంత్రపుష్పం వంటి పూజలు నిర్వహించారు. శుక్ర, శనివారాల్లో ఆలయంలో వాస్తు మండపారాధన, వాస్తు బలి, వాస్తు హోమం, మహాపూర్ణాహుతి, ఆలయ శిఖరానికి కుంభాబిషేకం, కుంకుమ పూజలు జరపనున్నారు. తొలి రోజు ద్వితీయ వార్షికోత్సవ పూజల్లో ఫార్మా పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు, పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, అధికారులు, భక్తులు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేనపూజ, పుణ్యావాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ చేస్తూ 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. ఆలయ సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ శాస్త్రోక్తంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామికి విశేషంగా హారతులు అందజేశారు.

కేంద్రానికి వ్యతిరేకంగా సీపీఐ బస్సుయాత్ర



బస్సుయాత్రను ప్రారంభిస్తున్న ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్

కూర్మన్నపాలెం: నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ తోపాటు ఇతర ప్రభుత్వ రంగం సంస్థలను కాపాడుకుందామని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్రను గురువారం కూర్మన్నపాలెం ఉక్కు దీక్ష శిబిరం వద్ద ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ, ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. లాభాలను ఆర్జిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కారుచౌకగా ధారాదత్తం చేయాలనుకోవడం అన్యాయమన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ప్రజల్లో ఉక్కు ఉద్యమంపై చైతన్యం కలిగిస్తూ ప్రారంభమైన బస్సుయాత్ర.. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగించి సెప్టెంబర్ 8న తిరుపతిలో జరిగే భారీ బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. సీపీఐ ప్రచార జాతా–బస్సుయాత్రకు అడుగడుగునా స్వాగతం పలికి జయప్రదం చేయాలని ప్రజలను అమర్‌జిత్ కౌర్ కోరారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి జె.వి.సత్యానరాయణమూర్తి, ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఓబులేసు, ఆర్.రవీంద్రనాథ్, అక్కినేని వనజ, జిల్లా సీపీఐ కార్యదర్శి ఎం.పైడిరాజు, గుర్తింపు యూనియన్ అదనపు కార్యదర్శి జె.రామకృష్ణ, సీపీఐ ఫ్లోర్ లీడర్ స్టాలిన్, కసిరెడ్డి సత్యనారాయణ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు సీహెచ్ నర్సింగరావు, జె.అయోధ్యరామ్, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కె.రాజబాబు, ఉక్కు నగరం సీపీఐ కార్యదర్శి తాండ్ర కనకరాజు, జి.ఆనంద్, కె.రాజబాబు, రాష్ట్ర యువజన సంఘం, విద్యార్థి సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

హెటిరో డ్రగ్స్‌లో ఉద్యోగాలకు 21న క్యాంపస్ ఇంటర్వ్యూలు

గాజువాక : ప్రముఖ ఫార్మా కంపెనీ హెటిరో డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ యూనిట్లలో ఉద్యోగాల భర్తీకి ఈనెల 21న స్థానిక టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్థన్‌రావు తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు, 2019–2023 మధ్య బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసి 26 ఏళ్ల లోపు వయస్సుగల అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వార్షిక వేతనం రూ.2.70 లక్షల నుంచి రూ.2.80 లక్షల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, గుర్తింపు కార్డు, విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు.